# క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు
- ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు

**కొత్తపేట:** ఏసుఈ నేలపై ఉదయించిన రోజైన ఈనెల 25 క్రిస్మస్‌ను ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు ఊరూవాడా చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవుల ఇంటా పండగ వాతావరణం నెలకొంది. ప్రతి చర్చిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈనెల ప్రారంభం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు ఈ నెల రోజులూ హాలిడే సీజన్, సీజన్ ఆఫ్ గివింగ్, సీజన్ ఆఫ్ జాయ్ గా జరుపుకొంటారు. ఆ మానవతామూర్తి వాక్కులు ఇచ్చే స్ఫూర్తిని హృదయాల్లో నింపుకొంటారు. దీనిని స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్‌గా పిలుస్తారు. ప్రభువు రాకడను సూచిస్తూ.. తమ ఇళ్లల్లో స్టార్లు ఏర్పాటు చేసుకుంటారు. క్రిస్మస్ ట్రీలను అలంకరించుకుంటారు. బాలఏసు పశువుల పాకలో పుట్టిన దృశ్యాన్ని ఇళ్లు, చర్చిలలో బొమ్మల రూపంలో అందంగా కూర్చుతారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల వ్యాప్తంగా.. సుమారు 2000 వరకూ పెద్ద, సుమారు 3000 వరకూ చిన్న చర్చిలు ఉన్నాయి. వీటిని దాదాపు చర్చి కమిటీల ఆధ్వర్యంలో పాస్టర్లు నిర్వహిస్తున్నారు. లూథరన్, బాప్టిస్టు, రోమన్ కేథలిక్ తదితర క్రైస్తవ శాఖల ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. క్లస్టర్ పరిధిలోని అనేక చర్చిలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా ముస్తాబయ్యాయి. ప్రధానంగా మన్నా, జూబ్లీ చర్చి, లూథరన్, ఆర్సీఎం, రోమన్ కేథలిక్ చర్చిలు ప్రార్థనా మందిరాల వద్ద



వాడపాలెం ప్రవచన దేవుని సంఘం యెరూషలెం చర్చి వద్ద స్టార్లతో స్వాగత ద్వారం

క్రీస్తు జననం సెట్టింగ్‌లను కళ్లకు కట్టినట్టు తీర్చిదిద్దారు. చర్చిల్లో పశువుల పాక సెట్టింగులు ఆకర్షణీయంగా వెలిశాయి. మండల కేంద్రాల్లో మార్కెట్లను క్రిస్మస్ శోభ సంతరించుకుంది. క్రిస్టియన్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో కూడా పాస్టర్లు ప్రముఖ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఇప్పటికే చర్చి వద్ద విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రేమ విందులతో చర్చి సభ్యులందరూ తమ కుటుంబ సభ్యులతో కలసి ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు.

**ప్రత్యేక ఆరాధన**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం అన్ని చర్చిల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. క్రిస్మస్ సందేశం అందించడానికి ప్రత్యేక అతిథులను, ప్రముఖ క్రైస్తవ గురువులను ఆహ్వానిస్తారు. ప్రత్యేకంగా క్రిస్మస్ గీతాలు ఆలపించి, కేక్ కట్ చేస్తారు. కొన్ని చర్చిల్లో క్రీస్తు వెలుగుకు గుర్తుగా కొవ్వొత్తులు వెలిగించి క్యాండిల్ సర్వీస్ నిర్వహిస్తారు. క్రీస్తు వెలుగు కలిగి ఉంటామని చర్చిల్లో ప్రమాణం చేస్తారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియ జేసుకుంటూ క్రిస్మస్ కానుకలు పంచుకుంటారు. అందరూ కలసి క్రిస్మస్ విందు ఆరగిస్తారు.

**క్రైస్తవులకు పవిత్ర దినం**



క్రిస్మస్ అంటే క్రైస్తవులకు ఓ పవిత్ర దినం. లోక రక్షణ, పాపుల విముక్తికై ఈ లోకంలో క్రీస్తు జన్మించారు. పరిశుద్ధమైన ఆత్మలతో క్రీస్తును కొలిచే క్రైస్తవుల ఇంటే కాదు ప్రతి చర్చిలోనూ ఆ లోక రక్షణ ఆరాధన కార్యక్రమాలు నిర్వహించుకుంటాం. ఆత్మ, సత్యంతో ఆరాధించడమే నిజమైన క్రిస్మస్. క్రిస్మస్ ఆరాధన అంటే క్రీస్తు మాదిరి నడుచుకోవడం, క్రీస్తు మాదిరి జీవించడం.

– బిషప్ జి.అబెద్నగో, యెరూషలెం చర్చి, కొత్తపేట

**మానవాళికి శాంతిని ఇచ్చేదే క్రిస్మస్**



సమాజంలో బాధ నుంచి భక్తిని బాధ్యతను నేర్పించి, ప్రపంచ శాంతిని, సౌభాగ్యాన్ని అనుగ్రహించే రోజు క్రిస్మస్. క్రైస్తవ విశ్వాసులు దేవునిపై పరిపూర్ణ భయ భక్తులతో ఆయనకు ఇష్టులుగా జీవించి శాంతి సమాధానాలు పొందడమే నిజమైన క్రిస్మస్ ఆరాధన. సమస్త మానవుల నిత్య జీవప్రాప్తికి మంచి మార్గం. క్రైస్తవ విశ్వాసం. సాక్ష్యం, ప్రేమ, ఐక్యత, ప్రార్థనా శక్తిని వృద్ధి చేసే మంచి తరుణం.

– బిషప్ అడపా ప్రసాద్, వాడపాలెం

## ఆకట్టుకున్న బుర్రకథ

**అలమూరు:** మండలంలోని నర్శిపూడి, చొప్పెల్ల, మడికి గ్రామాల్లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్-ఐటీసీ ఆధ్వర్యంలో ఆదివారం బుర్రకథ ప్రదర్శన జరిగింది. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కళాకారులు బుర్రకథ రూపంలో అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతల గురించి వివరించారు. ఆహారంలో అయోడిన్ సరైన మోతాదులో లేకపోవడం వల్ల అయోడిన్ లోపం ఏర్పడుతుందని, ఈ లోపం వల్ల మానసిక రుగ్మతలు సంభవించడంతో పాటు శారీరక అభివృద్ధి మందగిస్తుందన్నారు. అయోడిన్ లోప నివారణకు సముద్రపు ఆహారాలు, చేప, గుడ్డు, పాల ఉత్పత్తులు, అయోడైజ్డ్ ఉప్పుతో పాటు ఐరన్ అధికంగా ఉండే ఆహారాలు పాలకూర, మాంసం, చేప, ఉసిరి, విటమిన్-సి కలిగి ఉండే పదార్థాలను రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎస్.సునీత పాల్గొన్నారు.


నర్శిపూడిలో అయోడిన్ లోపంపై బుర్రకథ రూపంలో వివరిస్తున్న కళాకారులు

## ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదు

**అంబాజీపేట:** ఆరోగ్యానికి మించిన సంపద ఈ సృష్టిలో మరొకటి లేదని, ఆరోగ్యమే మహాభాగ్యమని, గురువే శ్వాస, శ్వాసే ప్రాణము, ప్రాణమే దైవము, దైవమే గురుస్వరూపమని పిరమిడ్ మాస్టర్లు అన్నారు. ప్రపంచ తొలి ధ్యాన దినోత్సవాన్ని అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన ధ్యానులు పళ్ళ సూర్యప్రకాశరావు (బాబ్జి) భాగ్యలక్ష్మికుమారి దంపతుల స్వగ్రహం వద్ద ధ్యాన దినోత్సవం నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్లు మాట్లాడుతూ ధ్యానం అన్ని సమస్యలకు, ఆరోగ్యానికి పరిష్కార మార్గమని, భూమి మీద ఉన్న ప్రతి వ్యక్తి తన దినచర్యలో భాగంగా ధ్యానం భాగమైపోవాలన్నారు. డాక్టర్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ సంకల్పదీక్షతో ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 196 దేశాలు ఏటా డిసెంబరు 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించాయన్నారు. కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పిరమిడ్ నిర్వహిస్తున్న మాస్టర్లు

## అధ్వాన రహదారిని అభివృద్ధి చేయండి

**అంబాజీపేట:** నడిచేందుకు వీలు లేకుండా అధ్వానంగా ఉన్న చిరతపూడి నుంచి నరేంద్రపురం వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారి గోతులతో నిండిపోవడంమే కాకుండా కొద్దిపాటి చినుకులకే బురదగా మారిపోతుందన్నారు. దాంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు బురదలో పడి గాయాలబారిన పడుతున్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న చిరతపూడి-నరేంద్రపురం రహదారి

## స్వచ్ఛందంగా బోదె బాగుజేత

**అయినవిల్లి:** తొలకరి పంట పూర్తయి దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే పంటచేలకు దాళ్వాలో సాగునీటి కొరత ఏర్పడటం తెలిసిందే. ప్రభుత్వం ఇప్పటి వరకూ పంట బోదెలపై దృష్టి సారించలేదు. సాగునీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేసిన వాటికి నిధులు ఇవ్వలేదు. ప్రభుత్వం మీద నమ్మకం లేక రైతులు రంగంలోకి దిగి యంత్రాలతో పంటబోదెలను తామే స్వచ్ఛందంగా బాగు చేయించుకుంటున్నారు. అయినవిల్లిలోని చింతనలంక-ముమ్మిడివరం మండలం మీదుగా ఉన్న పంటకాలువకు ఆనుకుని అయినవిల్లిలోని ఓ బోదెను ఇలా బాగు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగి సాగునీటి వినియోగ సంఘాలకు నిధులు ఇస్తే తమకు ఈ పరిస్థితి తప్పుతుందని రైతులు వాపోతున్నారు. కొంచెం డబ్బులున్నా బడా రైతులు పంట బోదెలను బాగు చేయించుకోవచ్చు. మా లాంటి చిన్నకారు రైతుల పరిస్థితి ఏంటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.


అయినవిల్లిలో పొక్లెయిన్ సాయంతో పంటబోదెను బాగు చేయించుకున్న రైతు

## సందడిగా క్రిస్మస్ వేడుకలు

**అయినవిల్లి:** అయినవిల్లిలోని న్యూకాలనీలో యేసుక్రీస్తు పరిశుద్ధ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ వసంత శేఖర్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. తొలుత కేకు కట్ చేసి ఏసు పుట్టినరోజు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో అమలాపురం మాజీ మున్సిపాల్ చైర్మన్ నల్లా విష్ణు, కేంద్ర రైతు కిసాన్ మోర్చా చైర్మన్ నల్లా పవన్ కుమార్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, తొత్తరమూడి మాజీ సర్పంచ్ మద్దా చంటి తదితరులు పాల్గొన్నారు.

**పాల్గొన్న ఎమ్మెల్యే దేవ**

**సఖినేటిపల్లి:** మండలంలోని మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్‌లో ఆదివారం రాత్రి యాజమాన్యం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ ఫౌండర్, ప్రొఫెసర్ డార్విన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో క్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీస్తు ప్రభువు సందేశం మానవాళికి ఆచరణీయమని అన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి నాని పాల్గొన్నారు.

## అణువణువులో వ్యాపించిన శ్రీకృష్ణుడు

**అయినవిల్లి:** శ్రీకృష్ణుడు అనంతకోటి బ్రహ్మాండంలోని అణువణువులో ఉన్నాడని మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీనివాస్ దాస్ ప్రభూజీ అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో కృష్ణ్ విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రంతో ఆయను జపించిన వారు ఆయన దామం చేరుకుంటారన్నారు. శ్రీకృష్ణుడు ప్రసాదించిన జ్ఞానంతో సంతోషంతో సుఖజీవనం సాగించవచ్చన్నారు. స్వామివారి లీలామృతం వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.


శ్రీకృష్ణుని ప్రత్యేక పూజలు చేస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ

## ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించేందుకు తీర్మానం

**అయినవిల్లి:** వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ప్రభల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు తీర్మానం చేశారు. ఆదివారం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ సన్నిధిలో ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు అధ్యక్షతన ప్రభల తీర్థం కోసం గ్రామసభ జరిపారు. ప్రభల తీర్థం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు గ్రామస్తులు ఏకగ్రీవం తీర్మానించారు.

# ఆదర్శనీయుడు పీవీ రావు

**అంబాజీపేట:** మాలమహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు ఆదర్శనీయుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. పీవీ రావు వర్ధంతిని అంబాజీపేట బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పులువురు నాయకులు పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, నాగాబత్తుల వెంకటపతి, నెల్లి వెంకటరమణ, నాగాబత్తుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మామిడికుదురులో పీవీ రావుకు నివాళులర్పిస్తున్న నేతలు

**మామిడికుదురులో..**

**మామిడికుదురు:** పీవీ రావు వర్ధంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ రావు ఆశయ సాధనకు కృషి చేస్తామని మాల మహానాడు నాయకులు భూపతి వెంకటపతి, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు పేర్కొన్నారు. పీవీ రావు ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నెల్లి దుర్గాప్రసాద్, నీతిపూడి మహేష్, పిల్లి శ్రీనివాస్, కుసుమ పెరుమాళ్లకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మలికిపురంలో..**

**మలికిపురం:** పీవీ రావు వర్ధంతిని ఆదివారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ జేఏసీ అధ్యక్షుడు చింతా రాజబాబు, గెద్దం ఫిలిప్‌రాజు, నల్లి శివ, కొల్లాబత్తుల అశోక్, గెడ్డం మిస్టర్, తాడి సహదేవ్, జిల్లెళ్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజోలులో..**

**రాజోలు:** పీవీ రావు వర్ధంతిని తాటిపాక సెంటర్‌లో దళిత చైతన్య వేదిక నాయకులు నిర్వహించారు. తొలుత పీవీ రావు విగ్రహానికి రాజోలు వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబు, మాలల న్యాయ పోరాట సమితి మండల జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల జేఏసీ ఉపాధ్యక్షుడు మందపాటి మధు, నాయకులు చిలకపాటి శ్రీధర్, గోగి మోహన్, నీతిపూడి సత్యనారాయణ, పొన్నమాటి భాస్కర్, కలిగిత త్రిమూర్తులు, జిల్లెళ్ల వినోద్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అంతర్వేది దేవస్థానం కౌలు రైతులతో సమావేశం


అంతర్వేదిలో కౌలు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సత్యనారాయణ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి సంబంధించిన కౌలు రైతులతో ఆదివారం ఆలయ ప్రాంగణంలో అధికారులు ఒక సమావేశం నిర్వహించారు. ప్రధానంగా దేవస్థానం పరిధిలోని అంతర్వేది, గొంది, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం గ్రామాల్లోని భూముల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులతో దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ పై సమావేశం ఏర్పాటు చేశారు. సదరు రైతులతో భూముల శిస్తుల పెంపుదల, బకాయిల వసూళ్లు, తదితర అంశాలపై ఆయన రైతులతో చర్చించారు. కాగా దీనిపై తామంతా చర్చించుకుని వారం రోజుల్లో నిర్ణయం తెలియజేస్తామని కౌలు రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రైతు సంఘ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, నల్లి బుజ్జిబాబు, పలువురు రైతులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### స్వామివారి సన్నిధిలో ఆర్డీవో


ఆలయంలో ఆర్డీవో మాధవికి స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆమెకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు. ఆర్ఐ వి.రామరాజు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే అంతర్వేది ఆలయంలో ఎస్‌బీఐ సీజీఎం రాజేష్ పాటిల్ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఏసీ అందజేశారు. వెంట బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా లక్షతులసి పూజ


పెదపట్నంలంక సీతారామచంద్రస్వామి

**మామిడికుదురు:** విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పెదపట్నంలంక గ్రామంలోనిసీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం లక్షతులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఖండవల్లి మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఈ పూజ ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. ముందుగా స్వామి వారి సన్నిధిలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. తదుపరి గంధ సిందూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజలో కర్తలుగా పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఏటా ఈ గ్రామంలోని సీతారామచంద్రస్వామి వారికి లక్షతులసి పూజ వైభవంగా జరిపిస్తున్నారు.

### యోగా నారాయణకు డాక్టరేట్



**మామిడికుదురు:** పాశర్లపూడి గ్రామానికి చెందిన మల్లాడి వీవీ సత్యనారాయణ అలియాస్ నారాయణను ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ నెల 28న దక్షిణ భారతదేశంలో యూనివర్సిటీ నిర్వహించే కాన్వొకేషన్‌లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారని నారాయణ ఆదివారం తెలిపారు. 2008లో బెంగళూరులో యోగాలో శిక్షణ పూర్తి చేసుకున్న నారాయణ 2010లో దుబాయ్ వెళ్లారు. 14 ఏళ్ల నుంచి దుబాయ్‌లో ఉంటూ 50 దేశాలకు చెందిన 60 వేల మందికి పైగా యోగాలో శిక్షణ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. పలువురు ప్రసిద్ధ నటులతో పాటు ప్రముఖులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆయన సేవలకు మెచ్చి గౌరవ డాక్టరేట్ ప్రకటించారు.

### దాళ్వా వరినాట్లకు రైతుల శ్రీకారం


నగరంలో నాట్లు వేస్తున్న కూలీలు

**మామిడికుదురు:** సార్వా సీజన్ ముగింపు దశకు చేరుకోవడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు దాళ్వా సాగుపై దృష్టి సారించారు. మామిడికుదురు మండలంలో దాళ్వా వరినాట్లు ప్రారంభమయ్యాయి. వ్యవసాయం సాగుకు రైతులు శుభఘడియలుగా భావించే శుక్రవారం, మంగళవారం మామిడికుదురు, నగరం గ్రామాల్లో రైతులు నాట్లు మొదలు పెట్టారు. ఇంత వరకు సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారని మండల వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. దాళ్వా సాగుకు ఎంటీయూ-1156 (తరంగిణి), ఎంటీయూ-1121 (శ్రీధృతి) రకాలు అనువైనవని ఆమె పేర్కొన్నారు. మండలంలో సుమారు 3150 ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా సాగు చేసేందుకు రైతులు నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఒక వైపు సార్వా కోతలు, పంట నూర్పిడి పనులు నిర్వహిస్తూనే మరో వైపు దాళ్వా పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. సార్వా కోతలు 80 శాతం పైబడి జరిగాయని, ప్రస్తుతం రైతులు దాళ్వా సాగుపై దృష్టి సారించారని ఏఓ వివరించారు.

### నిత్యాన్నదానానికి విరాళం


దాత లక్ష్మీకుమారికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన తాడిమళ్ల లక్ష్మీకుమారి ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

### యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక


అలమూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**అలమూరు:** మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికల ఏకగ్రీవంగా జరిగింది. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక కార్యాలయం (యూటీఎఫ్ హోం) ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సహచర సభ్యులందరూ అధ్యక్షుడిగా అద్దరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొంతు లోకేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశానికి ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని పదోతరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పలు ఉపాధ్యాయులను యూటీఎఫ్ కార్యవర్గం ఘనంగా సత్కరించింది. యూటీఎఫ్ నాయకులు వైవీవీ రమణ, కేవీఆర్ బాపూజీ, గొలుగూరి భాస్కరరెడ్డి, గిడ్డి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

### సంఘాల ద్వారా సాగునీటి వ్యవస్థల అభివృద్ధి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**మలికిపురం:** సాగునీటి సంఘాల ద్వారా గ్రామాలలో వ్యవసాయం, సాగునీటి వ్యవస్థల అభివృద్ధి చేసుకుందామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పి.గన్నవరం ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన గుబ్బల శ్రీనివాస్‌తో పాటు, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, కమిటీ డైరెక్టర్‌కు అభినందన సభ ఆదివారం మలికిపురంలో జరిగింది. ఎమ్మెల్యే దేవ పాల్గొని మాట్లాడారు. పదవులు పొందిన వారంతా అభివృద్ధిలో పాలు పంచుకోవాలని, అందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వేమా, చాగంటి స్వామి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, అడబాల సాయిబాబు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సుందర శ్రీనివాస్, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.